క్లుప్తంగా

క్యారమ్స్‌లో రాణించాలి



జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న సుధాకర్ గౌడ్

కర్నూలు(రూరల్): విద్యార్థులు క్యారమ్స్ పోటీలలో రాణించాలని జిల్లా క్యారమ్స్ సంఘం ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్ తెలిపారు. ఆదివారం నగరంలోని యునైటెడ్ క్లబ్‌లో జిల్లా స్థాయి పురుషుల క్యారమ్స్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నా. క్యారమ్స్ ఆడడం వల్ల ఏకాగ్రత, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఈ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 29,30 తేదీలలో మచిలీపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్యారమ్స్ సంఘం కార్యదర్శి చెన్న కేశవ రాజు, సిరాజ్ బాషా, అవినాష్, నాగేంద్ర, నరేష్, ఆది, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేయండి



కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరికి పూలబోకేను అందిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా జిల్లాలోని మత్స్య సహకార సంఘాలకు విరివిగా రుణాలు అందించి ఆయా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని జాతీయ మత్స్యకార సంఘం నగర అధ్యక్షుడు గ్యాస్ శ్రీనివాసులు కోరారు. కేడీసీసీబీ నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. విజయమనోహరిని ఆదివారం ఆయన సంఘం సభ్యులతో కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా జిల్లాలోని రైతులను ఆదుకుంటున్న విధంగానే మత్స్య సహకార సంఘాలకు కూడా న్యాయం చేయాలన్నారు. కుల వృత్తిపై ఆధారపడిన అనేక మత్స్యకార కుటుంబాలు జిల్లాలో ఉన్నాయన్నారు. చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో కార్యదర్శి బెస్త రాగిణి, కమలమ్మ తదితరులు ఉన్నారు.

శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్‌కు నివాళి



మాట్లాడుతున్న చైతన్య విద్యా సంస్థల కాలేజీ విభాగం ఏజీఎం మురళీకృష్ణ

కర్నూలు సిటీ: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మెన్ డా.బీఎస్ రావును ఆదివారం నివాళ్లులర్పించారు. నగర శివారులోని ఓ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ కాలేజీ విభాగం ఏజీఎం మురళీకృష్ణ, స్కూళ్ల విభాగం ఏజీఎం సురేష్ బాబు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద విద్యా సంస్థగా శ్రీచైతన్యను డా.బీఎస్ రావు తీర్చిదిద్దారన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదివిన వారు ఎందరో మెడికల్, ఇంజనీరింగ్ విభాగాల్లో గొప్ప, గొప్ప ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో మైపర్ విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, వాసవి విద్యా సంస్థల అధినేత సోమిశెట్టి వెంకట్రామయ్య, కట్టమంచి జనార్దన్ రెడ్డి, 2వ పట్టణ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్రం స్పందించాలి



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సి. క్యాంపు ప్రార్థన మందిరం సంఘస్తులు

కర్నూలు (టౌన్) : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న అమానవీయ ఘటనలపై కేంద్రం స్పందించి దాడులను అరికట్టాలని సీ.క్యాంపు ప్రార్థన మందిరం పాస్టర్ రెవరెండ్ గంటా కరుణ సాగర్ వెల్లడించారు. ఆదివారం ఆ మందిరం ప్రాంగణంలో మణిపూర్ క్రైస్తవులకు సంఘీభావంగా వర్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు భాస్కర్, సునీల్, రాజేంద్ర, ప్రసాద్, ఆనంద రావు, బెంజిమిన్ ఫ్రాంక్లిన్, గ్రేస్ ఇవాంజిలిన్ గుర్రం సురేంద్ర, కుమార్, కరణ్ పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు హెచ్చరించారు. ఆదివారం ఆ శాఖ ఆధ్వర్యంలో కర్నూలులోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.





పిచ్చుక గూళ్లు కాదు!

చెట్లపై కనిపించేవి పిచ్చుక గూళ్లు అనుకుంటే పొరపాటు పడినట్టే. చెట్లకు తలకిందులుగా వేలాడే గబ్బిలాలివి. వెంకటరమణ కాలనీలోని పంప్ హౌస్ వద్ద ఉన్న భారీ వృక్షాలను ఆవాసంగా చేసుకున్నాయి. ఉదయం చెట్లపై ఉండటం చీకటి పడగానే ఎగిరి ఆహార అన్వేషణ సాగిస్తున్నాయి. పంప్‌హౌస్ వద్ద వందల సంఖ్యలో ఉండటంతో దారిన వెళ్లే వారు వాటిని ఆసక్తిగా చూస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఈట్‌స్ట్రీట్ దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

- 7 షాపులకు 113 దరఖాస్తులు
- రేపు లాటరీ ద్వారా ఎంపిక

కర్నూలు (టౌన్): నగరంలోని బిర్లా సర్కిల్ వద్ద త్వరలో ప్రారంభించనున్న ఖానా ఖజానా (ఈట్ స్ట్రీట్)లో దుకాణాల ఏర్పాటుకు చిరువ్యాపారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. స్మార్ట్‌సిటీలో భాగంగా నగర ప్రజలు, పిల్లలతో కలిసి తల్లిదండ్రులు కొంతసేపు సేద తీరేందుకు బిర్లా సర్కిల్ వద్ద ఖానా ఖజానాను ఏర్పాటు చేశారు. రూ.2 కోట్లు వెచ్చించి ఇక్కడ చిన్నారుల కోసం ప్లే ఏరియా, ఈవెంట్స్ నిర్వహించుకునే సౌలభ్యం కల్పించారు. అలాగే వాహనాలకు పార్కింగ్ కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ కంపెనీ ఔట్‌లెట్స్, చిరు వ్యాపారం చేసుకునేందుకు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం ఈనెల 16 వ తేదీన టెండర్ ప్రకటన విడుదల చేసింది. పిజ్జా, బర్గర్ యూనిట్, ఐస్ పార్లర్ యూనిటీ, షుగర్ క్యాండీ, చాక్లెట్ ఐస్, బిర్యానీ పాయింట్ (చికెన్, మటన్, ఫిష్) శాఖ ఫలహార, జ్యూస్ సెంటర్, కాఫీ, టీ యూనిట్‌ల ఏర్పాటుకు పిలిచిన టెండర్‌కు మంచి స్పందన వచ్చింది. ఈనెల 22 వ తేదీ నాటికి 7 షాపులకు 113 మంది చిరు వ్యాపారులు ఒక్కొక్కరు రూ.30 వేలు డిమాండ్ డ్రాఫ్ట్ కట్టి తమ దరఖాస్తులు అందజేశారు. ప్రతి షాపునకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఈనెల 25 వ తేదీన స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన షాపులు కేటాయిస్తారు. ఈట్‌స్ట్రీట్‌లో ప్రతి షాపునకు రూ.12 వేలు అద్దె చొప్పున నగరపాలక రెవెన్యూ విభాగానికి ఆదాయం సమకూరుతుందని మేనేజర్ చిన్న రాముడు తెలిపారు.

రాజకీయ చైతన్యం పెరగాలి

- ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కర్నూలు(రాజ్‌విహార్): యువతలో రాజకీయ చైతన్యం మరింత పెరగాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్థానిక నగర శివారులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ అవగాహన సదస్సులో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మేలు చేసే నాయకుడిని ఎంపిక చేసుకునేందుకు ఓటు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖాదీర్ మాట్లాడుతూ త్వరలో తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ రాష్ట్రాల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తాము ఈసమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. సమావేశంలో కౌన్సిల్ పెద్దలు ముఫ్తీ షాయబ్ ఉల్లాఖాన్, హజరత్ ఖాద్రీ ముస్తఫా రిఫయి జిలానీ, ముఫ్తి మహమ్మద్ అబ్దుల్ సత్తార్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ రజాక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

యువకుడి కిడ్నాప్ కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామానికి చెందిన ఓ యువకుడిని కొంత మంది బొలెరోలో వచ్చి కిడ్నాప్ చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు .. కొర్రపోలూరు గ్రామానికి చెందిన చాబోలు మద్దమ్మకు ఇద్దరు కుమారులు. 20 రోజుల కిందట పెద్దకుమారుడు రువేస్ పెసరవాయి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల జ్యోతి (ఇద్దరు మేజర్లు) ఎవరికి తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం రువేస్ ఇంటి వద్దకు పెసరవాయి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నాగరాజు, కళావతి, సామేలు, లింకన్‌లు ఏపీ21 టీఈ 4623 బొలెరో వాహనంలో వచ్చారు. మా కుతూర్ని ఎక్కడ దాచి పెట్టారని వారి వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో చిన్న కుమారుడు ఆశోక్‌ను బొలెరో వాహనంలో బలవంతంగా ఎక్కించుకుని తీసుకువెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

అనుమతిలేకుండా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : అనుమతి లేకుండా లే అవుట్ల యజమానులు రోడ్లకు మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా మైనింగ్ కార్యాలయంలో లే అవుట్ యజమానుల సంఘం (క్రైడె, కాన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్ ఆఫ్ డెవలపర్స్ ఆఫ్ ఇండియా) నాయకులతో సమావేశం నిర్వహించారు. మట్టి తీసుకెళ్లేందుకు తాము రాయల్టీ చెల్లిస్తామని అనుమతి ఇవ్వాలని ఆ సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాసులు కోరారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ

కర్నూలు(అర్బన్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వివిధ రకాల పోటీలు ఎంతో ఉపయోగపడతాయని సెట్కూరు మేనేజర్ జి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ నెంబర్: 2 కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు వక్తృత్వం, పాటలు, నృత్యం, క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్, యూనిసెఫ్ మాజీ సభ్యులు, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బసవరాజు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులు, రంగస్వామి వ్యవహరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ... కళాశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు కొత్త ఉత్సాహం వస్తుందన్నారు. అలాగే ... పోటీతత్వం పెరగడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. వసతి గృహ సంక్షేమాధికారిణి కె. శిరీష మాట్లాడుతూ తమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి ఆదేశాల మేరకు వసతి గృహంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

85 ఏళ్లు దాటిన వారికి ట్యావి వాల్వ్ రీప్లేస్ ఉత్తమం

- ఢిల్లీకి చెందిన సీటీ సర్జన్ డాక్టర్ ఓపీ యాదవ్



డాక్టర్ ఓపీ యాదవ్‌ను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా 85 ఏళ్లు దాటి, ఆపరేషన్‌కు ఫిట్‌గా లేనివారికి ట్యావి వాల్వ్ రీప్లేస్‌మెంట్ ఉత్తమమని ఢిల్లీకి చెందిన కార్డియోథొరాసిక్ సర్జన్, ఐజేపీటీవీఎస్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ ఓపీ యాదవ్ చెప్పారు. ఏపీ కార్డియాలజి సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కార్డియాలజిస్టుల సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ ఓపీ యాదవ్ మాట్లాడుతూ అయోటిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్‌లో భాగంగా ఓపెన్ హార్ట్ సర్జరీ గాకుండా ట్రావి అనే వైర్ ద్వారా వాల్వ్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ ఎంత మాత్రం ఫలితాలు ఇస్తుందనే అంశంపై చర్చించారు. 85 ఏళ్లు పైబడిన వారు సాధారణంగా ఆపరేషన్‌కు ఫిట్‌గా ఉండరని, అలాంటి వారికి ట్యావి వాల్వ్ రీప్లేస్‌మెంట్, 65 ఏళ్లలోపు వారికి బైపాస్ సర్జరీ, యువతకు మినిమల్లీ ఇన్‌వేసివ్ కార్డియాక్ సర్జరీ ఉత్తమమని పేర్కొన్నారు. అనంతరం బెస్ట్ రీసెర్చ్ పేపర్ ప్రెజెంటేషన్ చేసిన స్విమ్స్‌కు చెందిన డాక్టర్ పి. వరుణ్‌కు సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ జి. సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఆ తర్వాత పీజీ విద్యార్థులకు క్విజ్ నిర్వహించగా కర్నూలు టీమ్ ప్రథమ, స్విమ్స్ టీమ్ ద్వితీయ బహుమతి గెలుచుకుంది. చివరగా ఏపీ సీఎస్ఐ అధ్యక్షులుగా కర్నూలుకు చెందిన డాక్టర్ ఎ. వసంతకుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం సదస్సు ద్వారా పలు తీర్మానాలు చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బేసిక్‌లైఫ్ సపోర్ట్ శిక్షణ ఇవ్వాలని, వారి ద్వారా 9, 10వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని, అలాగే స్టెమి ప్రోగ్రామ్‌లో భాగంగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులకు కర్నూలులో శిక్షణ ఇవ్వాలని తీర్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మినిమల్లీ ఇన్‌వేసివ్ కార్డియాక్ సర్జరీ నిర్వహిస్తున్న కర్నూలుకు చెందిన కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు. డాక్టర్ వెంకటయ్య చౌదరి స్మారక ఉపన్యాసాన్ని డాక్టర్ కార్తీక్ తుమ్మల, కార్డియాలజీలో వస్తున్న అభివృద్ధిని డాక్టర్ వి. రామచంద్ర, ఈసీజీ గురించి డాక్టర్ వై. సచిన్, గుండెజబ్బుల గురించి డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ సురేష్ ప్రసంగించారు. కార్యక్రమంలో కార్యక్రమ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్, డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ లక్ష్మణస్వామి, డాక్టర్ మహమ్మద్ అలి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి 10 వేల కోట్లు కేటాయించాలి

కర్నూలు(రూరల్): జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని 26,27,29,30 వార్డులలోని క్రిష్ణ నగర్, అబ్బాస్ నగర్, వెంకటాద్రి నగర్,శరీన్ నగర్‌లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ.... వార్డులలో నెలకొన్న సమస్యలను పరి ష్కరించి, నగరజనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని డిమాండ్ చేశారు. నగరంలోని ట్రాఫిక్ సమస్యను, పారిశుద్య కార్మికుల కొరతను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 26వ తేదీ ఆదోని నుంచి ప్రారంభమయ్యే పాతయాత్రను జయ ప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు సాయిబాబా, మధు, ఈశ్వర్, చైతన్య, రవికుమార్, వెంకట స్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు సీ. క్యాంప్ సెక్షన్ ఏఈ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా గణేష్ నగర్, శ్రీరామ్ నగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జయరాం నగర్, నంద్యాల చెక్ పోస్టు ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాజ చైతన్య దీప్తి బాలగంగాధర్ తిలక్

కర్నూలు కల్చరల్: సమాజాన్ని చైతన్య పరిచిన మహా వ్యక్తి బాలగంగాధర్ తిలక్ అని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో బాల గంగాధర్ తిలక్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉన్నత విద్యను అభ్యసించి సమాజ అభ్యున్నతికి తోడ్పడాలన్నది తిలక్ ఆశయమన్నారు. దీని సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ సభ్యులు, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా వాసికి సత్కారం

కర్నూలు(అర్బన్): హైదరాబాద్ త్యాగరాయ గానసభలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన స్వర సంగమం కార్యక్రమంలో జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగి గుర్రాల శ్రీనివాసులుకు ఘన సన్మానం లభించింది. ఉత్తమ గాయకులుగా శ్రీనివాసులును ఎంపిక చేసి సినీ నటి పూర్ణిమ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటోను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మూడవ పర్యాయం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపకులు చింతపట్ల వెంకటాచార్యులు, టీవీ ఆశోక్‌కుమార్, సినీ నటులు రాజ్‌కుమార్‌దత్ తదితరులు పాల్గొన్నారన్నారు.

సమస్యలకు పరిష్కారం

కర్నూలు (న్యూటౌన్): ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంతో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'స్పందన' కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు కాటసాని, టీజీ, బీవీ రెడ్డి, తదితరులు

కర్నూలు కల్చరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక రాఘవేంద్ర నగర్ సాయి సదన్‌లో ఆదివారం బ్రహ్మర్షి పత్రీజీ మొదటి ఆరాధనోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ పత్రీజీ ధ్యాన కేంద్రాలను దేశవ్యాప్తంగా నెలకొల్పారన్నారు. కర్నూలు రాఘవేంద్ర నగర్‌లో 1990లో మొదటి పిరమిడ్ కేంద్రాన్ని బీవీ రెడ్డి, పత్రీజీ కలిసి ప్రారంభించారన్నారు. టీజీవీ మాట్లాడుతూ కర్నూలులో మొదటి పిరమిడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పత్రీజీతో తమకు ఎన్నో ధ్యాన అనుభవాలు ఉన్నాయన్నారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని సహకారంతో జగన్నాథ గట్టు దగ్గర 200 అడుగుల ఎత్తైన పిరమిడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రాజు, ఐలా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ పత్రీజీ ఆరాధనోత్సవం

కర్నూలు(హాస్పిటల్): పిరమిడ్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ప్రథమ ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని శ్రీ షిరిడి సాయి వృద్ధాశ్రమంలో జరిగిన ఈ కార్యక్రమానికి సదానంద స్వామి ఆశ్రమం ఇన్‌చార్జ్ బైజుబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానమనే గొప్పతత్వాన్ని కర్నూలు కేంద్రంగా ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత పత్రీజీదే అన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షుడు బత్తిని శ్రీనివాసులు, వెంకటేష్, కిశోర్, మురళి, రాజు,రెడ్డి పాల్గొన్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవాలి

- కేడీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి



మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్ పర్సన్

కర్నూలు కల్చరల్: మన దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని కేడీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సీక్యాంప్ టీటీడీ కల్యాణ మండపంలో 'కథ చెబుతారా ఊ కొడతాం' పేరుతో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, మహనీయుల చరిత్రలను అధ్యయనం చేయాలన్నారు.టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ భక్తి, దైవ భక్తి, సనాతన భారతీయ విలువలు, వ్యక్తిత్వ వికాసంతో పాటు వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతల పేర్లను ప్రకటించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబాసేవా సమితి అధ్యక్షులు పసుపులేటి నీలిమ, కవులు, రచయితలు సీతామహాలక్ష్మి చంద్రమౌళిని, నాగమణి, వనజకుమారి, జోయషి సువర్ణ, తొగట సురేష్‌బాబు, పుల్లా రామాంజి, వీపూరి వెంకటేశ్వర్లు, సర్వజ్ఞమూర్తి, మధు, మునిస్వామి పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం

కర్నూలు కల్చరల్: ప్రకృతిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం 'సేవా సప్తాహం' కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా రెవెన్యూ కాలనీలోని భరతమాత దేవాలయంలో 'చెట్లు నాటారు. ఆయన మాట్లాడుతూ సేవా సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

7 వండర్స్ ఎగ్జిబిషన్ సీజ్

కర్నూలు (టౌన్) : నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న 7 వండర్స్ ఎగ్జిబిషన్‌ను నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అధికారులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. రెండు నెలల పాటు వండర్స్ ఎగ్జిబిషన్ నిర్వహణ కోసం రూ.20 లక్షలు వరకు నిర్వహకులు చెల్లించారు. అయితే, ప్రారంభానికి ముందు జీఎస్‌టీతో కలిపి మరో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంది. బకాయిలు చెల్లించకపోవడంతో పాటు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో మున్సిపల్ అధికారులు ఎగ్జిబిషన్‌ను సీజ్ చేశారు.

భగవద్గీత పఠనం ఉత్తమ జీవనానికి మార్గం



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులు



హరేరామ హరే కృష్ణ సంకీర్తనలు చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనం ఉత్తమ జీవనానికి మార్గమని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జపం, సంకీర్తనలు ఆలపించారు. శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మతోన్మాద పాలనను అడ్డుకోవాల్సిందే



జన కవనంలో పాల్గొన్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: మతోన్మాద పాలనను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సాహితీ వేత్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మణిపూర్ మారణ హోమంపై జనకవనం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ మతోన్మాదులు పాలిస్తున్న కేంద్ర రాష్ట్రాల్లో సామాన్యులు, బడుగు బలహీనులు ముఖ్యంగా ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. దేశంలో హింస పెరిగిపోతుందని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇది అధికంగా ఉందని విమర్శించారు. సాహితీ వేత్తలు వెంకటకృష్ణ, చౌశా, ముర్తుజా, నాగేశ్వరాచారి, గోరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, మారుతి, ఇనాయతుల్లా మాట్లాడుతూ మణిపూర్ దురాగతానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఘటనపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. మహిళలను రక్షించలేని ప్రభుత్వాలకు పాలించే అర్హత లేదన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కవులు, రచయితలు వెంకటేశ్వర్లు, వెంకటేష్, చక్రపాణియాదవ్, మహేష్, విజయులు, నాగముని, విశ్వనాథరెడ్డి, చంద్రయ్య, అయ్యన్నలు తదితరులు తమ కవితలను చదివి వినిపించారు.



కానరాని కాలువ

పై చిత్రంలో కనిపించే ప్రదేశం వీకర్ సెక్షన్ కాలనీ రేడియో స్టేషన్ సమీపంలోనిది. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లతో డ్రైనేజీ మూసుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీనికితోడు చిన్నపాటి వాన కురిసినా మురుగు రోడ్డెక్కి పారుతుంది. మునిసిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు